

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

మార్పు మీతోనే సాధ్యం!

- ఉన్నతమైన సమాజం నిర్మాణం వారి ద్వారానే..
- యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో పేర్కొన్న కాకినాడ జిల్లా కలెక్టర్

కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలలో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కూడా పాల్గొన్నారు. - వివరాలు 6లో



తెలుగు పండుగకు ముస్తాబు

నేడు, రేపు జీజీయూలో ప్రపంచ తెలుగు మహా సభలు

జీజీయూ కులపతి చైతన్యరాజు సారథ్యంలో ఏర్పాట్లు పూర్తి

- మెయిన్‌లో



- మెయిన్‌లో

యానాంలో మంగళవారం రాత్రి ఓ ప్రదర్శన

జోష్..

సందడిగా యానాం ప్రజా ఉత్సవం

ప్రతి ఏటా పండుగగా జరిగే యానాం ప్రజా ఉత్సవం ఈసారీ సందడిగా జరుగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ వేడుకలు బుధవారం రాత్రితో ముగుస్తాయి.



తొండంగిలోని దానవాయిపేట బీచ్

అలరించేలా!



అన్నవరం ఆలయం

పర్యాటకాభివృద్ధిపై యాక్షన్ ప్లాన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకేం తక్కువ.. అందమైన బీచ్‌లు లేవా.. ఆహ్లాదం పంచే ప్రకృతి ప్రదేశాలు లేవా.. ఆధ్యాత్మికతను పెంచే ఆలయాలు లేవా.. అన్నీ ఉన్నాయి.. అయినా ఏదో వెలితి.. పర్యాటకాభివృద్ధిలో ఎప్పుడూ వెనుకబాటే.. కేరళను మించి అందాలున్నా.. గోవాను మించి బీచ్‌లున్నా ఎందుకో నిర్లక్ష్యం.. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టి సారించింది.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 బీచ్‌లను అభివృద్ధి చేయాలని ప్రణాళిక రచించింది.. అంతేకాదు.. ప్రసిద్ధ ఆలయాలకు కొత్త రూపు తీసుకురానున్నారు.. సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించారు.. ఫిబ్రవరి నాటికి పర్యాటకంపై నివేదిక ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మూడు జిల్లాల కలెక్టర్లు కసరత్తు చేస్తున్నారు.

- పర్యాటకానికి స్వర్ణాంధ్ర-2047
- ఐదేళ్లలో ప్రణాళికలపై కసరత్తు
- 18 బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు
- దానవాయిపేట బీచ్‌కు రూ.10 కోట్లు
- హోప్ ఐలాండ్‌కు రూ.8 కోట్లు
- అన్నవరం కొండపై రోప్‌వే
- కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు రూ.5 కోట్లు
- తలుపులమ్మ లోవకు రూ.6 కోట్లు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పర్యాటక రంగాన్ని ఇక పరుగులు తీయించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సుదీర్ఘసాగర తీరం దగ్గర నుంచి ప్రఖ్యాత ఆలయాల వరకు పర్యాటకుల కోసం భారీ ప్రాజెక్టులకు పట్టాలెక్కించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో పూర్తిగా కుంటుపడిన పర్యాటక రంగాన్ని గాడినపెట్టేలా అనేక ప్రతిపాదనలతో విజన్‌ప్లాన్ తయారు చేసింది. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కార్యాచరణ కసరత్తును ప్రభుత్వానికి పంపించారు. అందులో భాగంగా జిల్లాలో సుదీర్ఘ తీర రేఖ పొడవునా అనేక అందమైన బీచ్‌లున్న నేపథ్యంలో వాటిలో ముఖ్యమైన వాటిని అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చేయనున్నారు.

మురిపించేలా...

కాకినాడ జిల్లా ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. తొండంగి నుంచి కాకినాడ వరకు సువిశాల సాగరతీరం పర్యాటకులను ఆకర్షిస్తోంది. సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ పర్యాటకులను కట్టిపడేస్తుంది. కోరంగి మడ అడవులు ఎంతో ప్రసిద్ధి. అన్నవరం నుంచి తలుపులమ్మ లోవ, సామర్లకోట భీమేశ్వరస్వామి, పిఠాపురం పుర్హుతికా అమ్మవారి ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. జాతీయస్థాయి పర్యాటకులను ఆకర్షించే సత్తా ఉన్నప్పటికీ జిల్లాను గత వైసీపీ ప్రభుత్వం పర్యాటకంగా గాలికొదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటకరంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు ఐదేళ్ల విజన్ ప్లాన్ తయారు చేస్తోంది. ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్వర్ణాంధ్ర-2047 పేరుతో జిల్లాలో 2029లోగా పర్యాటక రంగం అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రూ.35 కోట్లతో పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనల ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 18 బీచ్‌లను ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద అభివృద్ధి చేసే అవకాశం ఉందని నివేదికలో వివరించారు. తొలుత తొండంగి మండలంలోని దానవాయి పేటలోని బీచ్‌ను రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారు. వాస్తవానికి ఇక్కడ బీచ్ సువిశాలంగా ఉంటుంది. పర్యాటకులకు సురక్షితంగా ఉంటుంది. అలల తీవ్రత చాలా తక్కువ. పైగా ఇక్కడి నుంచి జాతీయ రహదారి సైతం చాలా దగ్గర. ఈ బీచ్‌ను రూ.10 కోట్లతో తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. అన్నవరం దేవస్థానానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి భక్తులు వేలల్లో వస్తుంటారు. రత్నగిరి కొండ నుంచి సత్యగిరి కొండకు 800 మీటర్ల పొడవునా రూ.6 కోట్లతో రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి దగ్గర్లోనే దానివాయిపేట బీచ్ కూడా ఉండడంతో పర్యా టకపరంగా ఈ ప్రాంతానికి మరింత ఆదరణ లభిస్తుందని అంచనా వేశారు. కాకినాడ తీరం నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే వచ్చే హోప్ ఐలాండ్ పర్యాటక పరంగా పేరొందింది.గత వైసీపీ ప్రభుత్వం హోప్ ఐలాండ్‌ను గాలికొదిలేసింది. బోటింగ్ నిలిపి వేసింది.దీంతో పర్యా టకులు ఈసురోమంటున్నారు. హోప్ ఐలాండ్‌కు తిరిగి నాటి వైభవం వచ్చేలా చేయడంతోపాటు ఎకో టూరిజం ప్రాజెక్టు కింద రూ.8 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అనేకమంది వస్తుంటారు. ఇక్కడ ఇప్పటికీ కనీస సదుపాయాలులేవు. చీకటైతే చిన్న లైట్ ఉండదు. ఈ బీచ్ వద్ద రూ.5 కోట్లతో సర్వహంగులు తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. బీచ్ ఫ్రంట్ వద్ద కన్వెన్షన్ హాల్ నిర్మించనున్నారు. తలుపులమ్మ లోవ ఆలయం వద్ద రూ.6 కోట్లతో వివిధ వసతులను తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. కాకినాడ జిల్లాలో మొత్తం ఏపీ కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద 18 బీచ్‌లను తీర్చిదిద్దాల్సి ఉందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో వివరించారు. అటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కోనసీమలలో హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తున్నాయని.. వీటికి అనువైన భూములు గుర్తించి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

టార్గెట్ ఫిబ్రవరి

ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి ఫిబ్రవరి నాటికి నివేదికలు పంపాలని కలెక్టర్లను ఆదేశించింది. ప్రధానంగా కాకినాడ కోరంగి వద్ద ఫోర్ సీజన్ హోటల్ పెట్టుబడులకు ముందుకు వచ్చింది. దీనికి 40 ఎకరాలను ఎంపిక చేసి ప్రతిపాదలను పంపాలని సూచించింది. రాజమహేంద్రవరంలో ఐఆర్‌సీటీసీకి 3 ఎకరాలను అన్వేషించి వివరాలు పంపాలని కోరింది. కోనసీమలోని పిచ్చుకలంక వద్ద మహీంద్రా హాలిడేస్ క్లబ్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇందుకు 26 ఎకరాల వరకు అవసరమని అంచనా వేశారు. దీనికి సంబంధించి నివేదికలను ఫిబ్రవరిలో పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. స్వదేశీ దర్శన్ స్కీం కింద కోనసీమ, పాపికొండలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వీటికి భారీగా నిధులు రానున్నాయి. ఏడు పర్యాటక యాంకర్ హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో రాజమహేంద్రవరంలో పర్యాటకపరంగా ఇంకా ఏమేం చేయాలనే దానిపై సలహాలు, సూచనలు, ఆలోచనలు ఫిబ్రవరిలోగా పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

కేరళ, తమిళనాడు తరహాలో జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కేరళ, తమిళనాడు తరహాలో జిల్లాలో కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఉద్యాన, పరిశ్రమలశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ముందుగా అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత టార్గెట్ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. రాయవరం మండలం మాచవరంలో పప్పు దినుసుల క్లస్టర్, మామిడికుదురు, మలికిపురం గ్రామాల్లో కొబ్బరి ఆధారిత యూనిట్ల ఏర్పాటులో పురోగతి, ఆత్రేయపురంలో పూతరేకుల క్లస్టర్ పురోగతిపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలతో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. అయితే ఆ స్థాయిలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని, ఆ దిశగా కమిటీ సభ్యులు చైతన్యవంతం చేయాలని సూచించారు. కొబ్బరి ముడిసరుకు ఆధారంగా వర్జిన్ కోకోనట్, కొబ్బరి నీళ్ల ద్వారా పౌడర్ తయారీ, కోకోపిట్ తయారీ వంటి విలువ ఆధారిత రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాలు ఎంపిక చేయాలని సూచించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్వయం ఉపాధితో పాటు మరో పది మందికి ఉపాధి చూపేందుకు అవకాశం కలుగుతుందన్నారు. యువత ఆసక్తికి అనుగుణంగా స్వయం ఉపాధి మార్గాలను చూపించనున్నట్లు చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా వివిధ శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అదనపు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ప్రతీ ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కుల వృత్తులకు అధునాతన పనిముట్లను రాయితీలపై అందించి ప్రోత్సహించాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సహకారంతో మరిన్ని యూనిట్లు నెలకొల్పేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, సహాయ సంచాలకుడు శివరామ్‌ప్రసాద్, ఉద్యానవన అధికారి బీవీ రమణ, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సిడ్బి ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్డీఎం కేశవవర్మ, క్వాయర్ బోర్డు ప్రతినిధి వినోద్‌కుమార్, కోకోనట్ బోర్డు ప్రతినిధి కుమార్, డీఎల్డీఆర్వో లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేసీ

అమలాపురం టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ప్రతీ విద్యార్థి తాము ఎంచుకున్న క్రీడలకు ప్రాధాన్యమిస్తూ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో వారిలోని క్రీడా ప్రతిభను వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలన్నారు. తొలిసారిగా ఆటలతో ఆరోగ్యం పేరిట జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో కోనసీమ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం క్రీడోత్సవాలను ఆమె ప్రారంభించారు. తొలుత జాతీయ పతాకాన్ని, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవడం ద్వారా పరిపూర్ణమైన విద్యార్థిగా ఎదగ గలుగుతారని వివరించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. ప్రారంభోత్సవ వేడుకల్లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి బీవీఎస్ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు తోట రవి, జి.గోవిందరావు, కోఆర్డినేటర్ కె.గణేశ్వరరావు, కౌన్సిలర్ సంసాని చంద్రశేఖర్, వైఎస్సీ రమణారావు తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు క్రికెట్ విన్నర్‌గా అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, వాలీబాల్ విన్నర్‌గా అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ జట్లు నిలిచాయి.

అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేదిలేదు

కోడి పందాలు, గుండాటలు నిర్వహిస్తే కఠినచర్యలు

సంక్రాంతి పండుగలను కుటుంబాలతో హాయిగా జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ కృష్ణారావు



అమలాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలు సంక్రాంతి పండుగలను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిర్వహించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి పండుగలను కుటుంబాలతో జరుపుకోవాల్సిందిగా సూచించారు. సంక్రాంతి పర్వదినాల ముసుగులో కోడి పందాలు, పేకాట, గుండాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో రైతులు గానీ మరే ఇతర భూముల యజమానులు గానీ వారి స్థలాల్లో కోడి పందాలు, గుండాట, పేకాట, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడానికి అనుమతించకూడదని, ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే భూ యజమానిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ మంగళవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. కోడికత్తులు కట్టేవారిపైనా, పందేలు నిర్వహించేవారిపైనా, గుండాటలు వేసే వారిపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారిని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా సంక్రాంతి పర్వదినాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు గానీ, కోళ్ల పెంపకందారులు, కత్తుల కట్టేవారి సమాచారాన్ని గానీ సంబంధిత పోలీసుస్టేషన్, ఎస్ఐ, సీఐ, డీఎస్పీలతో పాటు 112 లేదా ఎస్పీ కంట్రోల్ రూమ్ సెల్ నంబరు 8143792101 నంబరుకు తెలియజేసి సహకరించాలని కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు మండలస్థాయిలో ఎస్ఐ, తహశీల్దార్, జంతు హింస నిరోధక స్వచ్ఛంద సభ్యులతో మండల స్థాయిలో సంయుక్త బృందాలు నియమించామని, సభ్యులు ఆయా గ్రామాల్లో పర్యటించి పందేలు, గుండాట, పేకాట వంటి వాటిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే గ్రామస్థాయిలో కూడా కమిటీలు ఉంటాయన్నారు. ఇక సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా సంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు, కబడ్డీ వంటి క్రీడా పోటీలు నిర్వహించుకునే విధంగా ఆయా ప్రాంత పోలీసుస్టేషన్లలోని ఎస్ఐ, సీఐ, డీఎస్పీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక బృందాలు నియమించి పెట్రోలింగ్ నిర్వహిస్తూ బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగేవారిని అదుపులోకి తీసుకుంటామని, అల్లర్లు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కోడి పందాల విషయంలో గౌరవ హైకోర్టు ఇచ్చిన తీర్పు మార్గదర్శకాలను తప్పక అమలు చేయాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కృష్ణారావు విజ్ఞప్తి చేశారు.






లంకలగన్నవరం ఇసుక ర్యాంపులో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

లంకలగన్నవరం వశిష్ట నదీపాయలో ఓ లేడీ 'ఇసుక డాన్' ఆధ్వర్యంలో ఇష్టమొచ్చినట్లు తవ్వకాలు జరుగుతున్నాయి. అంతాతానై వ్యవహరిస్తున్న ఆ మహిళ అధికారులకు చుక్కలు చూపిస్తోంది. అసలు అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయనే విషయమే తమకు తెలియదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.

ఇసుక అక్రమ వ్యాపారంలో ఆమె

- లంకలగన్నవరంలో 'కొత్త' ర్యాంపు
- ఓ మహిళ ఆధ్వర్యంలో తవ్వకాలు
- ట్రాక్టర్లకు ట్రాక్టర్లు తరలింపు

ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు



పి.గన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పేరుతో గోదావరి నదీ తీరాలను ప్రభుత్వ యంత్రాంగం గాలికి వదిలేయడంతో ఇసుక మాఫియా బరితెగించింది. కనీస అనుమతులు లేకుండా ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేసి భారీగా తవ్వకాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆచరణలో పెడుతున్నారు. ఉచిత ఇసుక పేరుతో పలువురు కూటమి నాయకులతో పాటు పలుకుబడి ఉన్న పార్టీయేతర నాయకులు భారీ దోపిడీకి పాల్పడుతున్నారు. పి.గన్నవరం మండలంలో ఇప్పటికే పి.గన్నవరం శివారు డీఎస్ పాలెం, మానేపల్లి గ్రామాలలో అనధికార ఇసుక ర్యాంపులు జోరుగా నడుస్తున్నాయి. వీటితో పాటు ఉడిమూడి, గంటిపెదపూడి, కందాలపాలెం గ్రామాలలో గోదావరి నదీ తీరాలలో రాత్రివేళల్లో జోరుగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. మండల వ్యాప్తంగా మరికొన్ని ఇసుక, మట్టి ర్యాంపులు ప్రారంభానికి కూటమి పెద్దలు ప్రసన్నంతో అధికారులు నుంచి అనుమతులు తెచ్చుకుంటున్నారని తెలిసింది.

ఓపెన్ ఇసుక ర్యాంపునకు శ్రీకారం

తాజాగా భారీ ప్రణాళికలతో లంకలగన్నవరంలో వశిష్ట నదీపాయలో మరో ఓపెన్ ఇసుక ర్యాంపునకు శ్రీకారం చుట్టారు. కనీస అనుమతులు లేకుండా ఇసుక ర్యాంపును ప్రారంభించి తవ్వకాలు జరుపుతున్నారు. అమలాపురం పరిసర ప్రాంతానికి చెందిన ఓ మహిళ లంకలగన్నవరం శ్రీమహాలక్ష్మి అమ్మవారి గుడి వెనుక కొబ్బరి తోటలకు ఆనుకుని ఉన్న నదీపాయలో ఇసుక తవ్వకాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అయితే జిరాయితీ భూమి(కొబ్బరితోట)కి సమీపంలో ఉన్న నదీపాయ కూడా జిరాయితీలోనే ఉందని ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుపుకుంటున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇదే విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళితే ఆ ప్రాంతంలో ఏవిధమైన అనుమతులు లేవని తేల్చి చెబుతున్నారు. కాగా ఈ ఓపెన్ ర్యాంపు వెనుక కూటమికి చెందిన ఓ కీలక నేత తెరవెనుక ఉండి నడిపిస్తున్నారని ఆ నేత అండదండలతోనే సదరు మహిళ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఉచిత ఇసుక ర్యాంపు పేరుతో ర్యాంపులో రూ.800కు ట్రాక్టరు ఇసుకను విక్రయిస్తున్నట్లు తెలిసింది.

జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు

పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అనధికార ఇసుక ర్యాంపుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకుడు పడాల సూపర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జేసీ టి.నిషాంతిని కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు ఆయన వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక రవాణాను అడ్డుకోవాలని ఆమెను కోరినట్లు తెలిపారు.

గ్రామస్థులను బుజ్జగించేందుకు..

ర్యాంపు విషయమై ఇప్పటికే సదరు మహిళ లంకలగన్నవరం గ్రామస్తులు, పార్టీ నేతలతో పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు తెలిసింది.. ఇసుక తవ్వకాలకు సహకరించాలని సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. సహకరిస్తే గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని చెప్పినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వ అనుమతులు ఉంటే తమను బుజ్జగించడం ఎందుకని కొందరు గ్రామస్థులు నేరుగా ఆమెనే ప్రశ్నించారు. గత పది రోజులుగా గ్రామస్తులు రెండు దఫాలు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవడంతో ర్యాంపును తాత్కాలికంగా నిలిపివేసి తాజాగా మళ్లీ రెండు రోజులు నుంచి ప్రారంభించారు. కాగా మంగళవారం కూడా పలువురు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేయగా సదరు మహిళ నేతృత్వంలో కొందరు వారిని నిలువరించి ర్యాంపును నడిపించినట్లు తెలిసింది. ఇంత ధైర్యంగా సదరు మహిళ ఇసుక అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడడానికి కూడా అధికారులు జంకుతున్నారు. ప్రస్తుతం ర్యాంపులో ట్రాక్టర్లకు కూలీలు ఇసుకను ఎగుమతి చేస్తున్నారు. అలాగే నదీపాయకు సమీపంలో బాటలు ఏర్పాటు చేస్తున్నారు.

గుట్టు రట్టు!



కోమటికుంటలో శ్రీమాతంగమ్మ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

5 టన్నులు స్వాధీనం

భాగస్వాములపై కేసు నమోదు

గోపాలపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలో కోమటికుంట రెవిన్యూ పరిధిలో శ్రీమాతంగమ్మతల్లి ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం గుట్టు రట్టయ్యింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, కోమటిగుంట గ్రామానికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి మధ్య భాగస్వామ్యంతో కొనసాగుతున్న మిల్లులో అధికారులు 2 రోజుల పాటు తనిఖీలు చేశారు. ఈ రైస్‌మిల్లులో మంగళవారం రెవెన్యూ అధికారులు సుమారు 5 టన్నుల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గోపాలపురం మండలంలోని కోమటికుంట రెవెన్యూ పరిధిలో కొన్నేళ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా పనిచేసిన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన మేకా శేషుబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి, మరో ముగ్గురితో కలిసి మాతంగమ్మ మెట్ట వద్ద శ్రీమాతం గమ్మ ఆగ్రో రైస్‌మిల్లును ఏర్పాటు చేశారు. ఈ రైస్‌మిల్లులో శేషుబాబు కుటుంబంలో నలుగురికి 80 శాతం వాటాలు, మిగిలిన 20శాతం శ్రీరామమూర్తి భాగస్వామ్యంతో పర్మ్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది చాలాకాలం పాటు బాగానే నడిచింది. ఇటీవల భాగస్వాముల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ప్రారంభించారు. ఈ మిల్లు నిర్వహణపై ఎప్పటి నుంచో ఎన్నో ఆరోపణలు ఉండడంతో గతంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. అయితే అప్పటికి వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడం వీరికి బాగా కలి సొచ్చింది. దీంతో అప్పుడు విషయం బయటకు పొక్కలేదు. ఇటీవల ఇద్దరి భాగస్వాముల మధ్య అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయి. ఇదిలా ఉండగా రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉంచినట్టు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం విష్ణుప్రియ మిల్లు పేరుతో మరొకలోడు ఉన్న విషయం బయటకు పొక్కింది. ఈ మేరకు సమాచారం అందుకున్న సివిల్ సప్లయిస్, పోలీస్, రెవెన్యూ అధికారులు మిల్లును చుట్టుముట్టి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ప్లాస్టిక్ సంచుల్లో 2,133 కిలోల పీడీఎస్ బియ్యంతో పాటు మరో లారీలో రీసైక్లింగ్ చేసి గోనుసంచుల్లో ఉన్న 580 బస్తాలకు సంబంధించి 3.01 టన్నుల బియ్యం మొత్తంగా 5,233 కిలోలు సీజ్ చేసినట్టు తహశీల్దార్ కె.అజయ్‌బాబు, సీఎస్ డీటీ దివాకర్ తెలిపారు. రైస్‌మిల్లు యజమానులు మేకా శేషుబాబు, వెలగా శ్రీరామ్మూర్తిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం బియ్యాన్ని చిట్యాల శివారులో ఉన్న శ్రీనివాస ట్రేడర్స్ రైస్‌మిల్లులో భద్రపరిచారు. యాజమాన్యంతో పాటు మరికొంతమందిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తహశీల్దార్ తెలిపారు.

మార్పు మీతోనే సాధ్యం

గురువులే మార్గదర్శులు

- నా తల్లిదండ్రులు కూడా టీచర్లే
- అది నాకు దక్కిన అదృష్టం
- 3వ రోజు యూటీఎఫ్ స్వర్ణోత్సవంలో

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్





కాకినాడ జరిగిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, సభకు హాజరైన యూటీఎఫ్ ప్రతినిధుల బృందం

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజంలో మార్పు తీసుకురాగలరనీ, ఉన్నతమైన సమాజ నిర్మాణం వారి ద్వారానే జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా మూడో రోజు ప్రతినిధుల సభ జరిగింది. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే తనకు ఎంతో గౌరవమన్నారు. తన తల్లిద్రండులు కూడా ఉపాధ్యాయులు కావడం తన అదృష్టమన్నారు. ఉపాధ్యాయులు విద్యను బోధించడం ద్వారా సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసేవారిలో ఉపాధ్యాయులే ముందు వరుసలో ఉంటారన్నారు. తన తల్లిదండ్రులు ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం వల్ల తమ గృహంలో ఎలాంటి పెళ్లిళ్ల కార్యక్రమం జరిగినా ఆహ్వాన పత్రికలు ముందు ఉపాధ్యాయులకే అందిస్తామని, దీని వల్ల చిన్ననాటి నుంచి ఉపాధ్యాయుల సాధక బాధలు తనకు పూర్తిగా తెలుసునన్నారు. నోబెల్ పొజిషన్‌లో ఉన్న ఉపాధ్యాయులంతా ప్రతి రోజు ఒక మంచి సానుకూల దృక్పథంతో ముందడుగు వేయడం ద్వారా మరింత మందిని ప్రభావితం చేయగలరన్నారు.సభకు వచ్చిన ఉపాధ్యాయులు, మేధావులకు శుభకాంక్షలు తెలిపారు.

జగన్ పాలనలో విద్యావ్యవస్థ నాశనం

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యాభైఏళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలో తాను కూడా భాగస్వామ్యం అయ్యానని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని... 3,4,5 తరగతులను హైస్కూల్‌లో కలిపి చాలా తప్పిదం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వ మైనా విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. నేటి సమాజంలో సంఘంలో ఐక్యత తీసుకురావడానికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలుపించుకోవాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను అందరూ కలిసి రక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీలను నింపాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలన్నారు. 2007నుంచి ఇప్పటివరకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ మద్దతు లభించిన పట్టభద్రులు, ఎమ్మెల్సీలు 14సార్లు గెలుపొందారన్నారు. మార్చిలో జరిగే శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడుతున్న విజయగౌరీని.. కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి పట్ట భద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న తనని గెలిపించాలని కోరారు. తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని 2రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు.

విద్యారంగాన్ని కాపాడుకోవాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ప్రపంచబ్యాంకు కను సన్నల్లో నడుస్తుందన్నారు. పేద వర్గాలు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ప్ర మాదకర పరిస్థితిలో ఉన్న విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. రానున్న రోజుల్లో 24వేల ప్రభుత్వ పాఠశాలలు సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయన్నారు. పార్లమెంటులో చట్టం చేయకుండా కేంద్రం తెచ్చిపెట్టిన నూతన విద్యా చట్టం 2020 విద్యా వ్యాపారానికి అనుకూలం గా ఉందన్నారు. గత విద్యా మహాసభలో యూటీ ఎఫ్ సభ్యత్వం 80వేలు ఉండగా ఈ 17వ విద్యాసభకు అది కాస్తా లక్ష దాటిందన్నారు. ఉపాధ్యా యులకు ఉండే నిబద్ధతకు ఇదే ప్రతీక అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుల, మత, ప్రాంత వర్గాలకు అతీతంగా యూటీఎఫ్ ఉపాధ్యాయులు సమాఖ్యంగా పోరాటం చేయాలన్నారు. మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి సంఘం ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ నివేది కను హనుమంతురావు, మహిళా కమిటీ నివేదికను కుసు మకుమారి, రాష్ట్ర యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను మనోహర్ కుమార్‌లు ప్రవేశపెట్టగా కమిటీ ఏకా గ్రీవంగా తీర్మానించింది. అనంతరం యూటీఎఫ్ అకాడమిక్ అంశాల్లో ప్రతిభ చూపినవారికి జ్ఞాపికలను అందించారు. అనంతరం విప్లవగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస రావు, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కుసుమ కుమారి, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు కే.నగేష్, పి.చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శులు అరుణ కుమారి, సుభాషిని, కిషోర్‌కుమార్, మోహన్ రావు, శ్రీలక్ష్మీ, సుభాషిని, అన్నారాం, జ్యోతిబసు, యూటీఎఫ్ కృషిరాష్ట్ర పత్రికాబాధ్యులు ఐ.ప్రసాద్‌రావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటితో స్వర్ణోత్సవాల ముగింపు

గత 3రోజులుగా పీఆర్ కళాశాలలో జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారంతో ముగుస్తాయి. బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకుని ప్రకటిస్తారు



యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

వేటగాళ్ల ఉచ్చుకు.. గిరిజనుడి బలి



మృతిచెందిన గిరిజనుడు శంభురెడ్డి

విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత

మరొకరికి తీవ్రగాయాలు

వై.రామవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువులను హతమార్చేందుకు వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి అనేక మంది గిరిజనులు ప్రాణాలు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. తాజాగా అల్లూరి జిల్లా వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతంలో ఉన్న దారగడ్డ పంచాయతీలో అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతిచెందగా మరొక గిరిజనుడు తీవ్రంగా గాయపడి గుర్తేడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దారగడ్డ పంచాయతీలో బురదవలస గ్రామంలో తాటికొండ వీధికి చెందిన కడబాల శంభురెడ్డి (40) వేటగాళ్ల అమర్చిన విద్యుత్ తీగల బారిన పడి మృతిచెందగా అతడి వెంట వెళ్లిన మరో గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమ విద్యుత్ తీగలను ఉపయోగించే వ్యక్తులను నివారించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని దారగడ్డ ఉపసర్పంచ్ సొనుం రాఘవరావు కోరారు.



గాయపడిన మరో గిరిజనుడు

నిబంధనలు అతిక్రమించలేదు

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్
- పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్ కథనంపై స్పందన

పెద్దాపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన పిల్లల సమక్షంలో గన్ ఫైరింగ్ కథనంపై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాహుల్ స్పందించారు. ఆంధ్రజ్యోతికి ఆయన వివరణ ఇచ్చారు. ఫైరింగ్ శిక్షణ జరిగే సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, నిబంధనలు పాటించడం జరుగుతుందన్నారు. ఫైరింగ్ ప్రదేశంలో అక్కడున్న చిన్నారులు ఫైరింగ్ శిక్షణకు వచ్చిన అధికారి సంతానం మాట వాస్తవమే అని చిన్నారుల సంరక్షణకు ఎవరూలేక అక్కడకు తీసుకువచ్చినట్లు వివరణ ఇచ్చారు. ఫైరింగ్ విరామ సమయంలో చిన్నారులను అక్కడికి అనుమతించినట్టు తెలిపారు.

12 వరకు ఎస్సీ కులగణనపై అభ్యంతరాలు స్వీకరణ

తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శోభారాణి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాలు స్వీకరణ గడువును ఈనెల 12 తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎంఎస్.శోభారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు స్వీకరించిన అభ్యంతరాలు ఈ నెల 16వ తేదీ వరకు అధికారులు ఆన్‌లైన్‌లో నమో దు చేస్తారని తెలిపారు. అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కోరారు.

అక్కా అని పిలుస్తూ.. వివాహేతర సంబంధం!



కూళ్లలో హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

కూళ్లలో జరిగిన హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కె.గంగవరం, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మిత్రుల మధ్య గొడవకు అనంతరం హత్యకు వివాహేతర సంబంధమే కారణంగా భావిస్తున్నామని రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ టిఆర్‌కెసి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన హత్య ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతిచెందిన శివ సురేష్ ఇంటికి రోజూ పాలు పోయడానికి వెళ్లేవాడు. సురేష్ భార్యను శివ అక్కా అని పిలిచేవాడు. వారం రోజుల క్రితం శివ పని నుంచి కొంతసమయం ముందే ఇంటికి వచ్చేశాడు. సురేష్ ఇంటి వెనకాల సురేష్ భార్యతో మాట్లాడుకుంటూ ఉండగా ఇది సురేష్‌కు అనుమానం కలిగించింది. దీంతో సురేష్ తన భార్యని పుట్టింటికి పంపించేశాడు. దీనిని మనసులో పెట్టుకున్న సురేష్ శివను మద్యం తాగడానికి రమ్మని పిలిచాడు. అక్కడ వివాహేతర సంబంధం విషయంపై గొడవ పెట్టుకున్నాడు. అక్కడ శివను సురేష్ బ్లేడ్‌తో మెడపై కోసేశాడు. తరువాత దమ్ము చేసిన పొలంలో బోర్లా పడేసి ఊపిరిఆడకుండా మట్టిలో కూరేసి హత్య చేశాడు. గ్రామంలోని వెళ్లి శివను తాను చంపివేశానని కొంతమందికి చెప్పాడు. అనంతరం పరారయ్యాడు. దీనిపై ఇప్పటికే పామర్రు పోలిస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారిగా మండపేట రూరల్ సీఐ పి.దొరరాజును, సహాయకునిగా పామర్రు ఎస్ఐ ఎస్‌కె.జానీబాషాను నియమించారు. వారి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. శివ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని డీఎస్పీ తెలిపారు.

పొగాకు బ్యారన్‌లో అగ్ని ప్రమాదం



అగ్నికి ఆహుతవుతున్న పొగాకు బ్యారన్

రూ.6 లక్షలు ఆస్తినష్టం

గండేపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలో గొల్లవిల్లి బాబూరావు పొగాకు బాయిలింగ్ చేయడానికి లైసెన్స్ కలిగిన బ్యారన్‌లో మంగళవారం తెల్లవారుజామున సుమారు 5.30గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగే సమయంలో బ్యారన్ పొగాకు పంట ఉంది. సుమారు పొగాకు విలువ రూ.1.50లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. బాయిలింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన బ్యారన్ కూడా పూర్తిగా అగ్నికి దగ్ధమైందని, బ్యారన్ విలువ సుమారు రూ.5లక్షలు ఉంటుందని రైతు చెప్పాడు. అగ్ని ప్రమాదం జరగ్గానే రైతులు మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తూ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే బ్యారన్ పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

10న డిప్యూటీ సీఎం పవన్ రాక

- పిఠాపురం, గొల్లప్రోలులో పర్యటన
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఈ నెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. పిఠాపురం లేదా గొల్లప్రోలులో జరిగే సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పిఠాపురం మండలం మల్లాంలోని గోకులం, విరవాడ, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలను, పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని కలెక్టరు పరిశీలించారు. ప్రారంభోత్సవాల అనంతరం పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని సందర్శించే అవకాశం ఉంది. సభ ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సూర్యప్రకాశరావు, పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు ఉన్నారు.

ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఈనెల 10న పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారన్నారు. పిఠాపురం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగే సభా కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

ప్రసాదం నాణ్యతలో రాజీపడొద్దు

అన్నవరం దేవస్థానం ఈవో



ప్రసాదం రుచి చూస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి అత్యంత ప్రీతికరం, అమృతతుల్యమైన గోధుమరవ్వ ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడొద్దని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సూచించారు. మంగళవారం ఆయన ప్రసాదం తయారీ విభాగాన్ని పరిశీలించి ప్రసాదాన్ని రుచి చూశారు. ఏ విధంగా తయారు చేస్తారు, దిట్టం తదితర అంశాలను ప్రసాదం విభాగ ఇన్‌చార్జి పోల్నాటి లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం చాలా రుచిగా ఉందని, మరింత రుచి పెంచేందుకు అవకాశం ఉంటే ప్రయత్నించాలని వంటస్వాములను ఆదేశించారు. ప్యాకింగ్ తయారీ విధానాన్ని పరిశీలించి సిబ్బంది పనితీరును ప్రశంసించారు. పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.



అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేస్తున్న ఎస్పీ విక్రాంత్

కానిస్టేబుల్ అభ్యర్థులకు

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపికలో భాగంగా పురుష అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు 7వ రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. పరీక్షలకు మొత్తం 285మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 233మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షిస్తున్నారు.

ఏడిదలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

పాల్గొన్న ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు వాయిద్య కళాకారులు

మండపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలోని శ్రీఅభయ అంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయిదుర్గ నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు వెంటూరి సూర్యనారాయణ సారథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు నుంచి వచ్చిన నిష్ణాతులైన వాయిద్య కళాకారుల కచేరీ మంత్ర ముగ్ధుల్ని చేసింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. 500 మంది కళాకారుల సంగీత స్వర మాధురితో ఏడిద మార్మోగింది. శాస్త్రీయ సంగీతాన్ని కాపాడుతున్న ఏడిదకు చెందిన వెంటూరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో పాటు కళాకారులను టీడీపీ యువ నేత వల్లూరి సాయికుమార్ బాబు సత్కరించారు. కంచికామకోటి ఆస్థాన విద్వాన్ 'సంగీత సామ్రాట్' కె.దుర్గాప్రసాద్, శ్రీలంకకు చెందిన డోలు విద్వాంసుడు ఆర్వీఎస్ శ్రీకాంత్, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి ఆస్థాన విద్వాంసుడు రామవరపు చక్రధరరావు కచేరీ అలరించింది. టీడీపీ నాయకుడు పర్వతిన వీర్రాజు, కళాకారులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న నాదస్వర కచేరి, త్యాగరాజస్వామికి ప్రత్యేక అలంకరణ

లారీని ఢీకొన్న మినీ వ్యాన్

సామర్లకోట, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో ఏడీబీ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట ఐఎంఎల్ డిపో నుంచి మద్యం లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ ఎదురుగా మరొక వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి ఎదురుగా విశాఖ నుంచి సామర్లకోట రాక్ సిరామిక్‌కు వస్తున్న తమిళనాడుకు చెందిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన 2 వాహనాలను సామర్లకోట పోలీస్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

జనసేన ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
అల్లవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జనసేన నాయకులు ప్రసంగించారు. జనసేన అధ్యక్షుడు నల్లా రాము అధ్యక్షతన కొమరగిరిపట్నంలో జనసేన సమావేశం మంగళవారం జరిగింది. జనసేన పాత కమిటీనే కొనసాగించాలని సమావేశం తీర్మానించింది.

దుర్గాభవానీకి ఆర్థిక సాయం
అంతర్వేది, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో విద్యుత్‌షాక్‌తో చేయి కోల్పోయిన బర్రే దుర్గాభవానీకి ఎన్టీఆర్ సేవాసమితి మలికిపురం, సఖినేటిపల్లి మండలాలటౌన్‌వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్ రూ.20వేలు అందించారు. పాటి శివకుమార్, టౌన్ వైడ్ ప్రెసిడెంట్ చెల్లుబోయిన నాని పాల్గొన్నారు.

క్రీడోత్సవం ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆగ్రహం


క్రీడోత్సవ ప్రారంభోత్సవానికి చిన్న కత్తెర ఇవ్వడంతో అసహనంగా చూస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సందర్భంగా క్రీడోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హాజరయ్యారు. స్వాగతం ఫ్లెక్సీ ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకోర్టులను ప్రా రంభించేందుకు సిద్ధమవుతున్న సమయంలో చిన్నపాటి కత్తెరను ఏర్పాటుచేశారు. దీంతో కత్తెరను చూసి ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అక్కడున్న ఎంపీడీవో జీవీసరోవర్‌ను ఏర్పాట్లు ఎవరు చేశారని ఎమ్మెల్యే ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారని ఎంపీడీవో చెప్పారు. దీంతో విద్యాశాఖాధికారుల తీరుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోండి అంటూ ఆగ్రహించారు. అనంతరం మిగిలిన క్రీడా కోర్టులను ప్రారంభించకుండానే ఎమ్మెల్యే అసహనంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. కూటమి నాయకులు మైపాల తాతాజీ, రవణం రాము, కొర్లపాటి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, వాకపల్లి దొరబాబు, జల్లి బాలరాజు కొంతమంది నేతలు విద్యాశాఖాధికారులను నిలదీశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిపాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా అయినవిల్లి వినాయక ఆలయం

అయినవిల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహితంగా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. దేవస్థానం బోర్డు కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అయినవిల్లి స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. దేవస్థానం ప్రాంగణంలో ఎటువంటి ప్లాస్టిక్ వస్తువులను, కవర్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ నుంచే ఈనిబంధన అమలు చేయాలని ఆలయ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వానుపత్రి సమీపంలో స్థలాన్ని పరిశీలించాలని తహశీల్దార్‌ను జేసీ ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. తొలుత ఆలయ మర్యాదలతో జేసీకి స్వాగతం పలికారు. అనంతరం ఆమె అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం తరపున స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నిషాంతి

అపరిశుభ్ర పరిస్థితులను సహించేది లేదు: డీఈవో


నీళ్లరేవులో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కాట్రేనికోన, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులను సహించేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా హెచ్చరించారు. మండలంలోని పలు పాఠశాలలకు బైక్‌పై వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.చెయ్యేరు హైస్కూల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో, బయట అపరిశుభ్ర వాతావరణం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే బాధ్యులెవరని ఆయన ప్రశ్నించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత హెచ్‌ఎందేనని అన్నారు. అనంతరం కాట్రేనికోన హైస్కూల్‌ను సందర్శించి క్రీడా పోటీలను ప్రారంభించారు. దొంతికుర్రు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పల్లం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను తనిఖీచేశారు. శిథిల భవనంలో మధ్యాహ్న భోజనం వండుతున్న తీరును గమనించి వేరేచోటకు వంట మార్చాలని సూచించారు. నీళ్లరేవు పాఠశాలకు వెళ్ళి పరిస్థితిని గమనించారు. కందికుప్ప హైస్కూల్‌ను సందర్శించారు. ఉపాధ్యాయుల కొరతను హెచ్‌ఎం టి.వెంకటేశ్వరరావు డీఈవోకు వివరించారు. కాట్రేనికోన హైస్కూల్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కందికుప్పలో నియమించాలని ఎంఈవో ఎం.వెంకటరమణకు డీఈవో సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎమ్మెల్యే గిడ్డి

● కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆరోగ్యం కార్యక్రమం ప్రారంభం




మామిడికుదురు: క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఐ.పోలవరం: క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, అల్లవరం: క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్

మామిడికుదురు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. మండలంలోని 12స్కూళ్లకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడా పోటీలను ప్రారంభిస్తూ ఎమ్మెల్యే వాలీబాల్ ఆడి అలరించారు. ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, అడబాల తాతకాపు, సుందరనీడి చిన్నీ, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీలు వర్ధినేని తులసీరామ్, కొమ్ముల జంగమయ్య, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, ఎంఆర్వో ఆచార్యులు, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం
ముమ్మిడివరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ఉత్సాహం పెరుగుతుందని జడ్పీటీసీ కుడుపూడి శివశంకరరావు, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్యలు పేర్కొన్నారు. కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం జడ్పీ బాలుర, బాలికల హైస్కూలు, ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. జూనియర్ విభాగంలో, సీనియర్స్ విభాగంలో పోటీలు జరిగాయి. ఈపోటీల్లో బాలుర పాఠశాల హెచ్‌ఎం బి.హనుమంతరావు, బాలికల పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పరిమళ, జడ్పీ బాలుర పీడీ ఎస్.రాంబాబు, జీడ్పీ బాలికల పీడీ ఆర్.రమాదేవి, కొత్తలంక హైస్కూలు పీడీ పి.సుజాత, గాడిలంక హైస్కూలు పీడీ విజయకుమారి, గేదెల్లంక హైస్కూలు పీడీ ఇందిరాప్రియదర్శిని, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ హనుమవతి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పీఈటీ ప్రమీ పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి
మలికిపురం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ ఎంవీ సత్యవాణి అన్నారు. బట్టేలంక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి మంగళవారం ప్రారంభించారు. ఎంఈవో ఎం.విజయశ్రీ మాట్లాడుతూ అథ్లెటిక్స్ పోటీలతో పాటు బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి విజేతలు ఈనెల22, 23,24 తేదీల్లో అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. సర్పంచ్ బోనం సీతారత్నం, ఎంపీడీవో మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం
ఐ.పోలవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు దృష్టి పెట్టాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు విజ్ఞప్తి చేశారు. ఐ.పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే షటిల్ ఆడి అందరినీ ఆశ్చర్యపరిచారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, చింతలపాటి తాతబాబు, సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, పీఎంసీ చైర్మన్ బొలిశెట్టి వీర్రాజు, రాయపురెడ్డి బాబి, రాయపురెడ్డి స్వామినాయుడు, మద్దిరెడ్డి కుమార్, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఎంఈవోలు కొండారెడ్డి, తిరుమలరావు, హెచ్‌ఎం సురేష్‌బాబు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం
కాట్రేనికోన, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, మాజీ జడ్పీటీసీ నాగిడి నాగేశ్వరరావు, నల్లా నరసింహమూర్తి, ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి
రాజోలు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు దోహదపతాయని ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. మండల స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. రాజోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో మామిడిశెట్టి వెంకటసత్యనారాయణ, సర్పంచ్ రేవు జ్యోతి, కోఆప్షన్‌సభ్యుడు షేక్ ఇస్మాయిల్, మండల ప్రత్యేకాధికారి పి.బొజ్జిరాజు, ఉప సర్పంచ్ పామర్తి రమణ, ఎంఈవో2 టీఎస్కేడీ ప్రసాదరావు, పీడీలు రామకృష్ణ, ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ పెసింగి ఏసుబాబు, పీఈటీలు పాల్గొన్నారు.

200మంది బాలబాలికలతో క్రీడలు
అంతర్వేది, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి క్రీడా పోటీలు మోరి హైస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీపీ వీరా మల్లిబాబు క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు 200మంది బాలబాలికలతో మంగళవారం ఈక్రీడోత్సవాలు జరిగాయి. మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, మోరి సర్పంచ్ పసలపూడి లక్ష్మీపద్మమంగతాయారు, ఎంపీటీసీలు జాన లక్ష్మీదుర్గాసూర్యావతి, బళ్ల సుభాషిణి, ఎస్‌ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మీప్రసాద్, స్థలదాత జాన శంకరరావు(బాబ్జి), ముప్పర్తి నాని, ఎంపీడీవో ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ, ఎంఈవోలు డి.కిశోర్‌బాబు, ఎం.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ, పీడీలు డి.సుబాకర్, కె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీయాలి
పి.గన్నవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కల్గిన యువ క్రీడాకారులను వెలికి తీయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం హైస్కూల్లో మండల స్థాయిక్రీడలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం అందించినవాలీ బాల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. జూనియర్స్ విభాగంలో, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్.మురళీకృష్ణ, అసిస్టెంట్ రిజిష్టర్ ఎ.వర ప్రసాద్, ఎంపీడీవో కెవి ప్రసాద్, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరావు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, నల్లా దుర్గారావు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే
అయినవిల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సిరిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కోనసీమ క్రీడోత్సవాలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం పోటీలను ఆయన స్వయంగా ప్రారంభించారు. జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కుడుపూడి శాంతావతి, కాకర శ్రీనివాస్, బుచ్చిరాజు తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీవో జి.భీమారావు, ఎంఈవో పెచ్చెట్టి శ్రీనివాస్, హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, పి.పల్లయ్యశర్మ, గణపతి రామారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడోత్సవాలు ప్రారంభం
ఉప్పలగుప్తం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో కోనసీమ క్రీడోత్సవాలు మండల స్థాయిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంపీటీసీలు దేశంశెట్టి నాగరత్నకుమారి, నాగులపల్లి శేషవేణి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారి షంషే, ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్‌ఎం నూకల సత్యనారాయణ, ఎంఎస్‌డీవో కామన మధు, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, నీటి సంఘం డైరెక్టర్ మంచెం బాబి, యాళ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి : కలెక్టర్
అల్లవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆటల పోటీలు ఆరోగ్యం, మానసికోల్లాసాన్ని పెంచుతాయని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు. కొమరగిరిపట్నం న్యాపతి సుబ్బారావు పంతులు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండల స్థాయి కోనసీమ క్రీడోత్సవాలను కలెక్టర్ ప్రారంభించారు. మొదటిరోజు అథ్లెటిక్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. విద్యార్థులు క్రీడల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, జిల్లా క్రీడలఅధికారి సురేష్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, ఎంఈవో కె.కిరణ్‌బాబు, డీసీ చైర్మన్ దాట్ల గోపీరాజు, ఎంఈవో2 ఎస్.ఏడుకొండలు, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, వడ్డి సుభాషిణి, బర్రే సీతారత్నం, మంతెన సురేష్‌రాజు, హెచ్‌ఎం జీఎస్వీ రమణ,ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, పీడీలు యావీ మునలయ్య, ఎ.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక
ఐ.పోలవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ది మురమళ్ళ ఆటో యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా నక్కా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పలివెల సుబ్బారావు, కార్యదర్శిగా రాయపురెడ్డి వరబాబు, సంయుక్త కార్యదర్శిగా రాయపురెడ్డి సురేష్, కోశాధికారిగా ఇళ్ళ నాగేశ్వరరావు, గౌరవ సలహాదారుగా వీధి నాగభూషణం, గౌరవ అధ్యక్షుడిగా వీధి చిరంజీవిమాదిగ ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే బుచ్చిబాబును కలిసి సన్మానించారు. కార్యక్రమంలో గరిసిపాటి వెంకటేశ్వరరావు, కోలా సుబ్బారావు, మోర్త మురళీకృష్ణ, ఇళ్ళ వెంకటేశ్వరరావు, బొమ్మిడి రాజశేఖర్, కర్నీడి నాగరాజు, వీధి శేఖర్‌బాబు, మచ్చా నాగబాబు పాల్గొన్నారు.

కిశోర బాలికల భద్రత అందరి బాధ్యత
అమలాపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల భద్రత, బాధ్యతను అందరూ తీసుకోవాలని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. పదకొండేళ్ల నుంచి 18ఏళ్లలోపు కిశోర బాలికలను కంటికి రెప్పలా కాపాడాలని సూచించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులకు కిశోర్ వికాస మండల స్థాయి శిక్షణా తరగతులు సీడీపీవో విజయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ భాగ్యలక్ష్మితో పాటు జడ్పీటీసీ పందిరి శ్రీహరి మాట్లాడారు. అనేక అంశాలపై సీడీపీవోతో పాటు టీవోటీలు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ అడపా సత్తిబాబు, పీవో కుమారి, జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ మేనేజర్ జి.శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కేవీఎల్డీ కుమారి, కె.అన్నపూర్ణ, ఈశ్వరి, జి.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాఘవమ్మ మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు

అమలాపురంటౌన్, జనవరి7(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా ఎన్నో ప్రజా ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేస్తున్న కుడుపూడి రాఘవమ్మ మంగళవారం మృతిచెందారు. రాఘవమ్మ మృతి సీపీఎం పార్టీతో పాటు కమ్యూనిస్టు ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆమె మృతికి వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరామ్, ఆంధ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, పి.అమూల్య సంతాపాన్ని తెలిపారు.

నార్త్‌జోన్ క్రికెట్ జట్టుకు వివేక్ ఎంపిక

అమలాపురంరూరల్/పి.గన్నవరం, జనవరి7(ఆంధ్రజ్యోతి): సమనస డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న కొండపల్లి వివేక్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ దేవీదీక్షిత్ తెలిపారు. ఈనెల2 నుంచి 6వరకు కాకినాడలో జరిగిన అండర్-12 క్రికెట్ టీమ్ సెలక్షన్‌లో వివేక్ అద్భుత ప్రతిభ చాటి నార్త్‌జోన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల8 నుంచి మూడు రోజులు విజయనగరంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు ఉమ్మడి జిల్లాజట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న వివేక్‌ను పాఠశాల డైరెక్టర్లు సంధ్యాల మనువిహార్, స్నేహప్రియ, ఉపాధ్యాయులు సహచర విద్యార్థులు అభినందించారు.

ఉండ్రు సేవలు ఆదర్శనీయం
అల్లవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 38ఏళ్ల పాటు వ్యాయామోపాధ్యాయునిగా సేవలందించి ఎందరో క్రీడాకారులను తయారుచేసిన కోడూరుపాడు వ్యాయామోపాధ్యాయుడు ఉండ్రు సత్యవెంకటమునలయ్య సేవలు ఆదర్శనీయమని జిల్లా క్రీడల అధికారి సురేష్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. వ్యాయామోపాధ్యాయుడు మునలయ్యను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, డీసీ చైర్మన్ గోపీరాజు, మంతెన సురేష్‌రాజు, గునిశెట్టి రోహిణీకుమార్, నల్లా రాము, పరసా కిరణ్, ఎంఈవో కె.కిరణ్‌బాబు, ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, కొండేపూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు
పి.గన్నవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉడిమూడి శివారు పెదపేటలో యువతి ఈనెల5న పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నరు.

భవన నిర్మాణరంగ కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు

చిన్నా, నాగేశ్వరరావు

మలికిపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బోనం చిన్నా, కొప్పిశెట్టి నాగార్జునరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చొల్లంగి సూరిబాబు, అడబాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి అమలదాసు నాగరాజుతో పాటు మరో 27మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల ఏఐటీయూసీ నాయకులు కె.సత్తిబాబు, దేవ రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

యానాం ప్రజల సహకారం అవసరం: జీఎన్ నాయుడు
యానాం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): యానాంలో రీజెన్సీ పరిశ్రమ పునరుద్ధరణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు అన్నారు. మంగళవారం రీజెన్సీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజెన్సీ సంస్థ తిరిగి ప్రాంభమైతే వేలాది కుటుంబాలకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలుగుతుందన్నారు. రీజెన్సీ సంస్థ ముందుకు వెళ్లకుండా అడ్డుపడుతున్న వారిలో చైతన్యం తీసుకువచ్చేలా సహకారించాలన్నారు. రీజెన్సీ కోసం ప్రభుత్వం అన్ని విధాలా కొండత అండగా ఉంటుందని, ఉత్పత్తి కోసం ముందుకు సాగాలని సీఎం ఇచ్చిన భరోసాతో తాము రూ.కోట్లు పెట్టుబడిపెట్టి పరిశ్రమ ఉత్పత్తికి అన్ని సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఏడు వేల చదరపు మీటర్ల రీజెన్సీ టైల్స్ ఉత్పత్తి కోసం సహజవాయువు (గ్యాస్) సరఫరా కోసం కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని, వీటి కోసం సీఎం రంగసామి కేంద్రానికి నివేదిక పంపారని, కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకువచ్చి అందరూ సహకరించాలని కోరారు. సోమవారం రాత్రి రీజెన్సీ అంశాలపై మల్లాడి చేసిన అభియోగాలను నాయుడు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామశాఖ అధ్యక్ష పదవికి బాబి రాజీనామా
మామిడికుదురు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఈదరాడ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఆరేళ్లగా పనిచేస్తున్న యెరుబండి నాగముత్యం (బాబి) తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఈదరాడ సొసైటీ త్రీమెన్ కమిటీ ఎన్నికల గురించి ఇటీవల సమావేశం నిర్వహించి మూడు పార్టీల నుంచి కొంతమంది అభ్యర్థుల పేర్లను స్వీకరించారని, ఆ పేర్లు కాకుండా వేరే అభ్యర్థికి ఏకపక్షంగా కమిటీ చైర్మన్ పదవిని కేటాయించడంతో తాను పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. రాజీనామా పత్రాన్ని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్‌కు ఇచ్చినట్టు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య
ముమ్మిడివరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ కుమ్మర్లవీధికి చెందిన ముమ్మిడివరపు వెంకన్న(52) కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో వెంకన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకన్నకు భార్య దుర్గ, కుమార్తె జ్యోతినాగశ్రీ, కుమారుడు వీరవెంకటదుర్గాప్రసాద్ ఉన్నారు. వెంకన్న టీడీపీకి వీరాభిమాని. వెంకన్న ఆత్మహత్యతో ఆ ప్రాంతంలోని ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబంలో విషాదం నెలకొంది. ముమ్మిడివరం హెచ్‌సీ జీబీ స్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రతీ పంట పొలానికి నీరందేలా చర్యలు తీసుకోవాలి
రాజోలు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ఇబ్బంది పడకుండా పంట పొలాలకు నీరందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ సూచించారు. పొన్నమండలో రాజోలు ఇరిగేషన్ ఏఈఈ సుందరసింగ్ లస్కర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పగటిపూట 9గంటలు ఉచిత విద్యుత్ అందించాలి
అమలాపురం రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతులకు పగటిపూట తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకుడు ఉప్పుగంటి భాస్కరరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 వార్షిక సంవత్సరానికి ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల ప్రతిపాదనలపై మంగళవారం బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. విజయవాడ నుంచి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విశాఖపట్నం సంస్థాగత కార్యాలయం ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లాలోని ఈదరపల్లిలోని సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సులో ఎస్ఈ ఎస్.రాజబాబు, ఈఈ మోకా రవికుమార్ పాల్గొన్నారు. పలు అభ్యంతరాలను తీసుకున్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సందేశాలు, సూచనలు తెలియచేసేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ కోసం ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో అభిప్రాయాన్ని తెలిపేందుకు అనుమతి తీసుకోవాలన్నారు. ఈ నెల 8, 10తేదీల్లో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఎస్‌వోఏ కె.సత్యకిశోర్, డీఈ అన్నవరం, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'బస్సు చార్జీలు పెంచితే కఠిన చర్యలే'
అమలాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల వద్ద అధిక బస్సు చార్జీలు వసూలు చేస్తే సంబంధిత ట్రావెల్స్ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం అమలాపురంలోని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి కార్యాలయంలో ప్రైవేటు ట్రావెల్స్ ఏజెంట్లు, యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది పాల్గొన్నారు. బస్సుల్లో ఏసీలు, సీట్లు, విండోలన్నీ సక్రమంగా ఉండాలని, రిపేర్లు ఉంటే పూర్తి చేసుకోవాలన్నారు. టిక్కెట్లను డిమాండ్‌ను బట్టి ధరలు పెంచితే మాత్రం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికుల జాగ్రత్తల కోసం సూచనలు చేశారు.

నేడు ఏకాదశ రుద్రుల ఉత్సవ కమిటీ సమావేశం
అంబాజీపేట,జనవరి7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సంక్రాంతి తర్వాత కనుమ రోజు నిర్వహించే జగ్గన్నతోట తీర్థానికి సంబంధించి ఏకాదశ రుద్రుల ఉత్సవకమిటీ సమావేశం బుధవారం మొసలపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సమావేశంలో ఉత్సవ నిర్వహణ, సమస్యలపై చర్చించనున్నారు.

ఒక్కసారి ఆలోచించండి: సీఐ
అమలాపురం రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి ఆలోచించండి.. మీకోసం కాదు.. మీ పిల్లల కోసం. మిమ్మల్ని నమ్ముకుని బతుకుతున్న మీ కుటుంబ సభ్యుల కోసం.. అతివేగం వద్దు.. అది ప్రమాదానికి హేతువు అంటూ అమలాపురం తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో కామనగరువులో ర్యాలీ నిర్వహించారు. మోటారుసైకిల్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది వారి కుటుంబానికి రక్షణగా నిలుస్తుందన్నారు. ఎర్రవంతెన నుంచి కిమ్స్ వరకు ఆటో డ్రైవర్లు, కార్మికులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు, బొంతు బాలరాజుతో పాటు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం పైలట్ ప్రాజెక్టు

● మంత్రి సుభాష్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి7 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో ఆరోగ్యమే మహాభాగ్యం పైలట్ ప్రాజెక్టు అమలు చేయనున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో కేవీఆర్ ఆసుపత్రి వైద్యుడు డా.కోటసతీష్‌కుమార్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో హెల్తీహార్ట్ మిషన్ ద్వారా గుండెపోటులు నియంత్రించడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. ఇందుకుగాను వైద్యులు కోట సతీష్ కుమార్‌తోపాటు సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు ఒక ప్రైవేటు కంపెనీ సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. ముందుగా నియోజకవర్గ ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి ఆరోగ్యంపట్ల వారిలో చైతన్యం, అవగాహన కల్పిస్తామన్నారు. నేటి ఆధునిక జీవనశైలి, మానసిక ఆందోళన, ఒత్తిడి, మద్యం, ధూమపానం తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. పురుషులు హృదయ సంబంధిత రోగాలు, మహిళలు క్యాన్సర్ రోగాల బారిన పడుతున్నారని ఈ వ్యాధులను తొలిదశలో గుర్తించేందుకు నామమాత్రపు రుసుముతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రజల ఆరోగ్యసంరక్షణకు వ్యక్తిగత నిధులు కేటాయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రామచంద్రపురంలో రక్తనిధి, అనాధాశ్రమాలు ఏర్పాటుచేస్తామన్నారు. కేవీఆర్ ఆసుపత్రి వైద్యులు డా.కోటసతీష్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మేలుచేయాలనే సదుద్దేశంతో మంత్రి సుభాష్ హెల్తీహార్ట్‌మిషన్‌కు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గుండెపోటు వచ్చినవారికి 90 నిమిషాల వ్యవధిలో చికిత్స అందజేస్తే మరణాల రేటు తగ్గించవచ్చని అన్నారు. నూటికి 20 శాతం మందికే వైద్యం అందుతుందని మిగిలిన 80 శాతం మందికి వైద్యసహాయం అందజేయడమే మా కర్తవ్యం అన్నారు.

రామచంద్రపురంలో రికార్డుస్థాయిలో సభ్యత్వాల నమోదు

తెలుగుదేశం పార్టీ రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేశారని, ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మంత్రి సుభాష్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన రామచంద్రపురం పట్టణపార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 55వేలకుపైగా, పట్టణంలో 11 వేలకుపైగా సభ్యత్వాలు నమోదుచేసి నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. పట్టణంలో కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి పార్టీ కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తీసుకురావాలన్నారు. సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తిస్తామన్నారు. పార్టీ సభ్యత్వాలు నమోదులో, నీటి సంఘాల ఎన్నికల్లో సమిష్టి కృషిచేసినందుకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

కె.గంగవరం: నియోజకవర్గంలోని కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం ఆయన దంగేరు మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్‌చౌదరి ఇంటివద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బిజీ షెడ్యూల్ ఉండటంతో నియోజకవర్గంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండటం లేదని అక్కడక్కడ అసంతృప్తి ఉన్న విషయాన్ని గుర్తించానని చెప్పారు. ఇకపై మండల స్థాయిలో కూటమి నాయకులతో కమిటీ ఏర్పాటు చేసి తద్వారా సమస్యల పరిష్కారం చేస్తానన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణను పరామర్శించారు.

రూ.25వేలు ఆర్థికసాయం


దంగేరులో ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ అనారోగ్యం పాలైన భట్లపాలిక శివారు రావిదొడ్డిపేట గ్రామానికి చెందిన కూరాటి లోవరాజుకు మంత్రి రూ.25వేలు ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు తన సొంత ఖాతా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి పార్టీ నాయకులు రావిపాటి గణేష్ చౌదరి, నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సలాది రమేష్, తోట వెంకన్న, రవ్వా భూషణం, మేడిశెట్టి రవికుమార్, బలుసు శివప్రసాద్, తాడి శ్రీను, మనకపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలో జింక్, పొటాష్ వాడకం తప్పనిసరి: ఏవో

కె.గంగవరం, జనవరి7(ఆంధ్రజ్యోతి): రబీ పంటలో జింక్, పొటాష్‌ను తప్పనిసరిగా ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఏ.వి.రంగారావు, ఏవో బలుసు రవి అన్నారు. మంగళవారం పామర్రు, యండగండి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు జరిగాయి. వీటిలో వారు పాల్గొని మాట్లాడారు. దుబ్బు కుళ్లు నివారణకు వ్యవసాయశాఖ ద్వారా ఇస్తున్న సుడోమోనాస్ మందును పెంటలో కలుపుకుని పొలాల్లో చల్లుకోవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. ఆయా గ్రామాల వీఏఏలు గణేష్, లావణ్య, రైతులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి అమ్మవారి ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజలు

ద్రాక్షారామ, జనవరి7(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీ అమ్మవారి ప్రతిష్ఠ 12వ వార్షికోత్సవ పూజలు రామచంద్రపురం మండలం హసన్‌బాదలో మంగళవారం ఘనంగా జరిగాయి. శ్రీనివాసశర్మ బ్రహ్మత్వంలో తెల్లవారు జామున 5గంటల నుంచి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వయంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. కాకినాడకు చెందిన పడవల పూర్ణచంద్రమౌళి, సూర్యకుమారి దంపతులచే మహాలక్ష్మీ శాంతిహోమం, శ్రీనివాస కల్యాణం జరిగింది. కాకినాడకు చెందిన రుక్మిణి అమ్మవారికి సారె సమర్పించారు. 300 చీరలు మహిళా భక్తులకు పసుపు, కుంకుమలతో అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయకమిటీ ఛైర్మన్ గొల్లపల్లి పద్మరాజు, చేనేత శ్రామిక నాయకులు దొంతంశెట్టి సత్యప్రకాష్, బట్ట శ్రీను, కలెపు గంగాధరం, కమిటీ సభ్యులు గోరు సత్యనారాయణ, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, వైసీపీ ఇన్‌చార్జి పిల్లిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి: 9 మందిపై కేసు

ఆలమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో మంగళవారం పేకాట ఆడుతున్న వారిపై రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 9మందిని అదుపులోనికి తీసుకున్నారు. మండలంలోని మడికి, చిలకలపాడు గ్రామాలవద్ద పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు విద్యాసాగర్ సిబ్బందితో అక్కడికి వెళ్లి దాడి చేయగా ఈరెండు ప్రాంతాలలో 9మంది పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.

ద్వారపూడి వంతెనపై ప్రమాదాల నివారణకు చర్యలు



మండపేట, జనవరి 7(ఆంధ్ర జ్యోతి): ద్వారపూడిలో వున్న రైల్వే ఫ్లైఓవర్ వంతెనపై తరచూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నామని పంచాయతీ కార్యదర్శి ఆకుల వీ.వీరమణ చెప్పారు. కూటమి నాయకులు పంచాయతీ పాలకవర్గంతో కలిసి ఆయన మంగళవారం వంతెనపై ఏర్పాటుచేసిన మూడు గేట్లను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ గజ్జి రమణ, మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, జనసేన నాయకుడు చింతా దొరబాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రమేష్‌రాజు, గోణం పుల్లయ్య, టంకశాల మురళీకృష్ణ, పల్ల బాబు, సలాది బాలసు బ్రహ్మణ్యం, రాజు పాల్గొన్నారు.

ఇసుకర్యాంపు వద్ద జట్టు కార్మికుల నిరసన

కపిలేశ్వరపురం, జనవరి7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం తనకు ఉపాధి కల్పించాలంటూ జట్టు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. జట్టు కార్మిక సంఘం నాయకులు బొక్కా శ్రీనివాస్, రమణ, సంగాని శ్రీనివాస్, తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం జట్టు కార్మికులతో ఇసుక ఎగుమతికి అనుమతి ఇచ్చిందని, ఇటీవల లారీలతో రాత్రి వేళల్లో ఇసుక తరలించేస్తున్నారన్నారు. దీంతో ర్యాంపు బాటపొడై ట్రాక్టర్లు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై తొలుత ఆపినప్పటికీ తమను లెక్కచేయకపోవడంతో ర్యాంపులోని కార్మికులంతా ఏకమై ర్యాంపును నిలిపివేసి ఆందోళన చేపట్టామన్నారు. దీనిపై ర్యాంపును ఆపివేసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ విషయమై కొద్దిసేపటి అనంతరం ర్యాంపు నిర్వాహకులు జట్టుకార్మికులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ర్యాంపు యథావిధిగా కొనసాగింది. కార్యక్రమంలో జట్టుకార్మిక నాయకులు డొక్కా శ్రీనివాస్, తెలుకోటి రమణ, కర్రి బాలరాజు, శేఖర్, జట్టుకార్మికులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం ర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న జట్టు కార్మికులు

జాబ్‌మేళాలో 13 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి7(ఆంధ్రజ్యోతి):స్థానిక కృత్తివెంటి పేర్రాజుపంతులు జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 13 మంది ఎంపికయ్యారు. స్కిల్ హబ్ నిర్వహించిన జాబ్‌మేళాకు 38 మంది హాజరయ్యారు. 4 ఎంఎన్‌సీ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి.


కె.గంగవరం: పామర్రులో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్


ఆలమూరులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు


మండపేటలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రాణి

క్రీడలతో మానసిక ఆరోగ్యం

- మంత్రి వాసంశెట్టి సుభాష్
- జూన్‌లో తల్లికి వందనం
- ఫీజుల బకాయిల పేరుతో హాల్ టిక్కెట్‌లు ఆపితే కఠిన చర్యలు
- విడతల వారీగా ఫీజు రీఎంబర్స్‌మెంట్
- ఘనంగా ప్రారంభమైన కోనసీమ క్రీడోత్సవాలు

కె.గంగవరం, జనవరి7(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఆరోగ్యంతోపాటు శరీర ధారుడ్యం ఏర్పడుతుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం పామర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా మండలస్థాయిలో జరిగిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుకుంటున్నారు. కానీ గ్రౌండ్‌లో ఆటలతో కాన్ఫిడెన్స్ పెరుగుతుందని చెప్పారు. క్రీడల్లో ఓటమిని స్పోర్టివ్‌గా తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. జూన్ నెలలో తల్లికి వందనం వేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఫీజు చెల్లించలేదని ఏ విద్యార్థికి హాల్‌టికెట్ ఆపడానికి వీలులేదని కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించామని చెప్పారు. వారికి దఫదఫాలుగా రీఎంబర్స్‌మెంట్ వేస్తామన్నారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంఈవో ఏ.నాగరాజు, ఉపాధ్యాయ సంఘాల నేతలు నరాల కృష్ణకుమార్, నేమాని వెంకటరమణ, మేడిశెట్టి పుల్లయ్య, కూటమి నాయకులు కర్రి చిట్టిబాబు, చిర్రా రాజ్‌కుమార్, మరివాడ సూరిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, సలాదిరమేష్, కొత్తపల్లి మొరార్జీ, తోట వెంకన్న, మేడిశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

ఆలమూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని వీటివల్ల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పలువురు వక్తలు అన్నారు. మండల స్థాయి క్రీడా ఉత్సవాలు ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే పోటీలలో పలు రకాల క్రీడల పోటీలను నిర్వహించనున్నారు. ముందుగా పోటీలను ఎంపీడీవో ఎ.రాజు, సర్పంచ్‌లు నాతి లావణ్య, యేడిద సత్యశ్రీ, ఆలమూరు సాగునీటి డీసీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, నాయకులు ఈదల సత్తిబాబు, నల్లబాబుతోపాటు పలువురు నాయకులు పాల్గొని ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు నిర్వహించారు.

రాయవరం: రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి కోనసీమ క్రీడోత్సవం కార్యక్రమాన్ని ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు మంచి అవకాశంగా పేర్కొన్నారు. అనంతరం మండలంలోని 46పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అథ్లెటిక్స్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, టీడీ పీ నాయకుడు ఉండవల్లి రాంబాబు, ఎంపీడీవో కీర్తి స్పందన, తహశీల్దారు ఐపీ శెట్టి, పీఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, హెచ్‌ఎం వి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం మహాత్మా గాంధీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో క్రీడాపోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ తదితర పోటీలలో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఎంపీడీవో వెంకటరామన్, ప్రత్యేకాధికారి రామారావు, ఎంఈవోలు ప్రసాదరావు, సాహెబ్, కరస్పాండెంట్ పీఎస్ రాజు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: క్రీడలతోనే మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి దుర్గారావు, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో కోనసీమ క్రీడోత్సవం, ఆటలతో ఆరోగ్యంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బాలుర సీనియర్స్ వాలీబాల్ విభాగంలో కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాల విన్నర్ గాను, వల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల రన్నర్‌గాను, కబడ్డీ విన్నర్స్‌గా కపిలేశ్వరపురం జడ్పీ, రన్నర్‌గా వల్లూరు జడ్పీ, ఖోఖో విభాగంలో కపిలేశ్వరపురం విన్నర్, నల్లూరు రన్నర్‌గా నిల్చినట్లు పీడీ జి.వేణుగోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కె.తాతారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేట: కోనసీమ సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలో మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. మండపేట ఏడిదరోడ్డులో వున్న ఎస్.వీ.ఎస్. ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన క్రీడాపోటీ లను మండపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వ రరావు ప్రారంభించారు. పట్టణ మున్సిపల్ పాఠశాలలకు చెందిన విద్యార్థుల క్రీడా పోటీలను మండపేట ఆలమూరు రోడ్డులోవున్న అన్నపూర్ణ హైస్కూల్లో నిర్వహించారు. మండల విద్యాధికారి నాయుడు రామచంద్రరావు, ఎంపీడీవో సత్య న్నారాయణమూర్తిల సారథ్యంలో పోటీలు జరిగాయి. వివిధ విభాగాల్లో విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. మండపేట మండల పరిషత్ పరిపాలనాధికారి వీ.నాగేంద్ర ప్రసాద్, ఈవోపీఆర్డీ దాసరిశ్రీనివాస్, మండల విద్యాధికారి 2 సోమిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●మండపేట మున్సిపల్ కమీషనర్ టీ.వీ.రంగారావు సారథ్యంలో మండపేట మున్సిపల్ కార్యాలయంవద్ద మంగళవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రీడాపోటీలతోపాటు మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. పట్టణంలో మహిళలు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గులను ఛైర్‌పర్సన్ రాణి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైసీపీ నేత రెడ్డిరాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టీ.వీ.రంగారావు పర్యవేక్షించారు. మెప్మా సిబ్బంది సుజాత, మున్సిపల్ డీఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.06లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం నిర్వహించారు. నోము ఆచరించి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,06,961 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం: ఎంపీడీవో


విద్యార్థినులకు ఉన్నత చదువులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమౌతుందని, ఇంటర్‌తో బాలికలు చదువును మానేయవద్దని ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన పిలుపునిచ్చారు. మంగళవారం రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభకు కొదవలేదన్నారు. ఇంటర్మీడియట్ తో చదువును ఆపకుండా ఉన్నత చదువులు చదవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నౌడు వెంకటరమణ, సమగ్ర శిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు, టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు, ఎంఈవో పి.రామలక్ష్మణమూర్తి, దేవిశెట్టి చిన్ని, కె.సూర్యప్రకాష్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


గారపాటి సత్యవతి(ఫైల్)

ఆత్రేయపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన గారపాటి సత్యవతి(70) మంగళవారం మృతిచెందారు. భర్త సుబ్బారావు, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈమె నేత్రాలను దానం చేయడంతో కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రాజమహేంద్రవరం రాధాకృష్ణ ఐ బ్యాంకు వైద్య బృందం ఆమె కార్నియాలను సేకరించారు. ఈమె మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలి

● కార్మికశాఖాధికారి నాగ మల్లేశ్వరరావు


చొప్పెల్ల ఇటుకబట్టీల వద్ద కార్మికులతో వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఆలమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాలలో కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలని కార్మిక రిజిస్టార్లు రికార్డులు నిర్వహించాలని కార్మికశాఖ మండపేట అధికారి కాశీ నాగమల్లేశ్వరరావు సూచించారు. పని ప్రదేశాలలో కార్మిక చట్టాలను అమలుచేసే బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. ఆలమూరు మండలం చొప్పెల్ల ఇటుకబట్టీలను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్మికులతో ఆయన మంగళవారం మాట్లాడారు. అనంతరం బట్టీల వద్ద కార్మిక రికార్డులను పరిశీలించారు. రికార్డులలో ఉన్న లోపాలను సవరించుకోవాలని ఆయన సూచించారు. పనిచేస్తున్న వారికి కార్మిక సంక్షేమనిధికి రూ.వంద బ్యాంక్‌లో చలానా తీయాలని మల్లేశ్వరరావు తెలిపారు. బట్టీలలో బాలకార్మికులను చేర్చుకోవద్దన్నారు. కార్మికులకు విధిగా కార్మిక వేతన చట్టం అమలు చేయాలని ఆయన సూచించారు.

సంక్రాంతికి కోడిపందాలు వేస్తే సహించేదిలేదు

● మండపేట రూరల్ సీ.ఐ దొర్రై రాజు

మండపేట, జనవరి7(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గపరిధిలో ఎక్కడైనా సంక్రాంతి పండుగను పురష్కరించుకుని కోడిపందాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని మండపేట రూరల్ సీ.ఐ పి.దొర్రై రాజు నిర్వాహకులను హెచ్చరించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాంప్రదాయ పండుగ సంక్రాంతిని జరుపుకోవాలే తప్ప చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

రాయవరం: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందాలు, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ సంక్రాతి పండుగలను ప్రజలంతా సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలన్నారు. మండలంలోని మాచవరం సెంటర్‌లో రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఆత్రేయపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకకు చెందిన మహిళకు మూడేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది కాపురం అనంతరం విడాకులు తీసుకున్నారు. ధవళేశ్వరంలో కుట్టుమిషన్ నేర్చుకుంటుంది. ఈనెల 5న ఇంటి నుంచి వెళ్ళిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. మహిళ సోదరుడు బంధువులు ఇంటికి వెళ్లి గాలించిన ఆమె ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు

●వాడివేడిగా కపిలేశ్వరపురం మండల సమావేశం


సమావేశంలో విద్యుత్ సమస్యలపై ఏఈని వివరణ అడుగుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం వాడివేడిగా కొనసాగింది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గ్రామాల్లోని పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. సమావేశానికి సకాలంలో ఐదుగురు కార్యదర్శులు హాజరుకాకపోవడంపట్ల ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఎంపీడీవో కె.రత్నకుమారిని ఆదేశించారు. బాధ్యత లేకుండా సమావేశానికి హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. చదువుకునే పిల్లలకు 15వేలు, మహిళలకు 1500,మహిళలకు ఫ్రీ బస్సు వసతి దీవెన తదితర హామీలు ఇంతవరకూ నెరవేర్చలేదన్నారు. అనంతరం ఎంపీడీవో రత్నకుమారి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మత్స్యకార భరోసా ఎంతమందికి ఇచ్చారు. ఎంతమందికి రావాల్సి ఉందని ఆశాఖ అధికారిని పలువురు ప్రజాప్రతినిధులు వివరణ కోరారు. గత ప్రభుత్వంలో చేసిన పెండింగ్ బిల్లులు ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్సీ తోట అధికారులను ప్రశ్నించారు. కాలేరు వంతెన వద్ద రైలింగ్ ఏర్పాటు చేసి రేడియం బోర్డులు పెట్టించాలని, జలజీవన మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి, లైన్‌మెన్ లేకపోవడం, విద్యుత్ పోల్స్, పలు విద్యుత్ సమస్యలు, తదితర అంశాలపై ఆ గ్రామసర్పంచ్ దాయం కావేరి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. వల్లూరులో వివిధ సమస్యలపై ఆ గ్రామసర్పంచ్ దాసి మీనాకుమారి అధికారులకు వివరించారు. 15, 20 సం.రాల నుంచి డ్వాక్రా సంఘాలు చేస్తున్న రేషన్ షాపులు అన్యాయమని తహసీల్దార్ చిన్నారావుకు ఎమ్మెల్సీ తోట వివరించారు. పేదప్రజలకు ఉచిత ఇసుకవిధానంపై రెవెన్యూ అధికారులు వివరణ ఇవ్వాలని అచ్యుతాపురం ఎంపీటీసీ పలివెల మధు కోరారు. కేదార్లంక, నారాయణలంకలో పర్మిషన్ లేకుండా ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయడం ఏమిటని ఎమ్మెల్సీ అధికారులను వివరణ కోరారు. హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై భయాందోళనలు చెందాల్సిన పనిలేదని సీహెచ్‌సీ అధికారి రాజ్‌కుమార్ వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీలు గుణ్ణం భానుప్రసాద్, సాకా శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి కామేశ్వరరావు, తహసీల్దార్ చిన్నారావు, మండలపరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.